# ఘనంగా కామ్రేడ్ నల్లమల్ల గిరి ప్రసాద్ వర్ధంతి




ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి
శనివారం | 25 మే, 2024 | పేజీలు : 05

## సంవత్సరం పాటు ధరించేలా యూనిఫామ్స్ కుట్టించండి



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే యూనిఫామ్స్ సంవత్సరం పాటు ధరించేలా మన్నికగా కుట్టించాలని అధికారులకు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. శుక్రవారం మానకొండూర్ మండల కేంద్రంలో రుద్రమ మండల సమాఖ్య ఆద్వర్యంలో నడుస్తున్న మహిళా శక్తి కుట్టు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సంధర్బంగా స్వశక్తి మహిళలు కుడుతున్న యూనిఫామ్స్‌ను పరిశీలించారు. మహిళలతో మాట్లాడుతూ డబుల్ స్టిచ్చింగ్ వేయాలని వారికి సూచించారు. మన్నికగా ఉండేలా యూనిఫామ్స్ కుట్టాలని పేర్కొన్నారు. జూన్ 5వ తేదీ వరకు యూనిఫామ్స్ రెడీ చేయాలని అధికారులకు సూచించారు. డబుల్ స్టిచ్చింగ్ చేసి మన్నికగా సంవత్సరం కాలం పాటు ఆగేలా యూనిఫామ్స్ ఉండాలని పేర్కొన్నారు. ఇందుకు అవసరమైన దారానికి సంబంధించిన ఖర్చులు తాను అందిస్తానని తెలిపారు. దీంతో పాటు క్లాత్ తీసుకువచ్చేందుకు అయ్యే రవాణా ఖర్చులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. యూనిఫామ్స్ లుక్ అదిరిపోయేలా ఉండాలని, అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సూచనలు అందించాలని పేర్కొన్నారు. అనంతరం మానకొండూర్‌లోని మండల సమాఖ్య భవనంలో నిర్వహిస్తున్న యూనిఫామ్స్ క్లాత్ కటింగ్‌ను కలెక్టర్ పరిశీలించారు. క్లాత్ వృధా కాకుండా జాగ్రత్తగా కటింగ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిఆర్డీవో శ్రీధర్, ఏపిఎంలు నిరంజన్ పాల్గొన్నారు.

## ప్రత్యక్ష పరిశీలన మంచి అనుభవం

### పథకాల అమలపై సంపూర్ణ అవగాహన

### జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి : ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికై పథకాల అమలును ప్రత్యక్షంగా పరిశీలించడంతో మంచి పని అనుభవం వస్తుందని కలెక్టర్ అనురాగ్ జయంతి పేర్కొన్నారు. సెంట్రల్ సెక్రటేరియట్ కు చెందిన ఏఎస్ఓలు అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్స్ శిక్షణలో భాగంగా జిల్లాకు 27 మంది ఈ నెల 20 వ తేదీన రాగా, 24 వ తేదీన వారి పర్యటన ముగింపు సందర్భంగా కలెక్టర్ అనురాగ్ జయంతి వారితో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర రక్షణ, పట్టణ గృహ నిర్మాణ, హైవే రహదారుల, కార్మిక, ఉపాధి కల్పన తదితర శాఖలకు ఎంపికైన ఏఎస్ఓలు ఐదు రోజుల్లో గ్రామాల్లో ఏమి పరిశీలించారో అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల అమలును పరిశీలించడంతో సంపూర్ణ అవగాహన వస్తుందని వివరించారు. విధి నిర్వహణలో ఈ అనుభవం ఎంతో ఉపయోగ పడుతుందని పేర్కొన్నారు. స్థానిక సంస్కృతి, సంప్రదాయాలలో ఇక్కడి పండుగలు, పూజలు, జీవన శైలి శిక్షణకు వచ్చిన వారందరికీ ఒక మధురానుభూతిగా నిలిచిపోతుందని కలెక్టర్ వివరించారు. శిక్షణకు వచ్చిన వారు తంగళ్లపల్లి మండలం రామన్నపల్లి, ముస్తాబాద్ మండలం నామాపూర్, ఎల్లారెడ్డి పేట మండలం బొప్పాపూర్, చందుర్తి మండలం సనుగుల, గంభిరావుపేట మండలం నర్మాలలో గ్రామాల్లో ఉపాధి హామీ పనులు, వైకుంఠ దామాలు, ప్రైమరీ హెల్త్ సెంటర్లు, అంగన్ వాడీలు, ఎగువ మానేరు, వివిధ పంటల సాగు తీరును నేరుగా పరిశీలించారని జడ్పీ సీఈవో ఉమారాణి తెలిపారు. ఇక్కడ రీజినల్ ట్రైనింగ్ మేనేజర్ భిక్షపతి పాల్గొన్నారు.

## నిర్లక్ష్యపు డ్రైవింగ్ కుటుంబ భవిష్యత్తు రోడ్డు పాలు




ప్రజాపక్షం/మంచిర్యాల క్రైం : చిన్నపాటి నిర్లక్ష్యపు డ్రైవింగ్ కుటుంబాన్ని రోడ్డు పాలు చేస్తుందని, డ్రైవింగ్ చేసే సమయంలో వాహన చోదకులు అప్రమత్తంగా ఉండాలని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం రామగుండము పోలీస్ కమిషనరేట్ పరిధి పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో, అధికారుల వద్ద డ్రైవింగ్ విధులు నిర్వహిస్తున్న 50 మంది సిబ్బందికి రామగుండం కమిషనరేట్ లో డ్రైవర్స్ కి అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి రామగుండం పోలీస్ కమీషనర్ ఎం.శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై డ్రైవర్స్‌కి పలు సూచనలు, సలహాలు, జాగ్రత్తలు తెలిపారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ వాహనాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మంచి కండిషన్లో ఉంచుకోవాలని వాహన డ్రైవర్లను ఆదేశించారు. పోలీసు అధికారుల ఆధీనంలో ఉన్న వాహనాలను సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, సొంత వాహనంలా మంచి కండిషన్‌లో ఉంచి ఎప్పటికప్పుడు సర్వీసింగ్, ఇంజన్ ఆయిల్, టైర్ల నిర్వహణ చూడాలన్నారు. రోడ్డు ప్రమాదాల వలన 1,69,000 మంది ప్రాణాలు కోల్పోవడం జరిగిందని. 4 లక్షల మంది క్షతగాత్రులు అయ్యారని, ప్రతి నిమిషానికి ఒక రోడ్డు ప్రమాదం జరుగుతుంది తెలిపారు. కాబట్టి ఒక చిన్న నిర్లక్ష్యపు కారణం వలన ప్రమాదం సంభవించి వారి కుటుంబ భవిష్యత్తు రోడ్డు పాలవడం జరుగుతుందన్నారు. వాహనంలో కూర్చొని ప్రయాణించేప్పుడు అప్రమత్తంగా వుండి, రోడ్డును నిశితముగా గమనిస్తూ ముందుకు వెళ్ళాలని, డ్రైవర్ లు విశ్రాంతి సమయంలో విశ్రాంతి తీసుకోకుండా అనవసరంగా సమయం వృధా చేసుకొని వాహనం నడుపు సమయం లో ఇబ్బందిగా వాహనం నడపకూడదని తెలిపారు. ఏలాంటి ఆనందమైన విషయం ఐనా, సంతోకరమైన విషయం ఐనా, బాధాకరమైన లేదా ఎలాంటి సమస్య ఉన్న వాహనం ఎక్కేవరకే ఉంచాలని, ఒక్కసారి డ్రైవింగ్ సీట్ లో కూర్చున్నాక పూర్తి స్థాయిలో దృష్టి డ్రైవింగ్ పైనే ఉండాలి లేకపోతే ఏదో ఆలోచనలో ఉండి వాహనం ప్రమాదానికి గురయ్యే అవకాశం ఎక్కువ ఉంటుందన్నారు. ప్రజలకు పోలీసులు ఆదర్శంగా ఉండాలని, ట్రాఫిక్ రూల్స్ పాటించకుండ పోలీస్ ప్రతిష్ట కి భంగం కలిగే విధంగా ప్రవర్తిస్తే శాఖపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఏదైనా ఆరోగ్య, కుటుంబ సమస్యలు ఉన్నప్పుడు అధికారులకు తెలియజేస్తే మీ స్థానంలో వేరొక డ్రైవర్‌ని పంపడం జరుగుతుందని, సమస్యను చెప్పకుండా డ్రైవింగ్ కష్ట పడుతూ చేయడం వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపి అడ్మిన్ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసిపి రాఘవేంద్ర రావు ఎఆర్ ఏసిపి ప్రతాప్, ఆర్ఐ ఎంటిఒ మధు, ఆర్ఐ మల్లేశం, శ్రీనివాస్, రామగుండం ఎంవిఐ మధు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

## రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్ కేసులు



ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి : నేర విచారణ మరింత సమర్ధవంతంగా చేయడంతో పాటు చాలా రోజుల నుండి పెండింగ్లో ఉన్న కేసులపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ వాటిని త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని వాటిని సత్వరం పరిష్కరించే విధంగా పోలీస్ అధికారులంతా పని చేయాలని, నకిలీ విత్తనాలను అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక నిఘా ఏర్పాట చేయాలని జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ.... ఇప్పటివరకు నమోదైన కేసులలో నాన్ గ్రేవ్ కేసులు, గ్రేవ్ కేసుల విషయంలో తీసుకోవలసిన చర్యలు గురించి అధికారులకు వివరించారు. గుర్తుతెలియని మృతదేహాలు దొరికినప్పుడు కేసు నమోదు చేయగానే వెంటనే ఫోటోలు సీసీటీఎన్ఎస్ లో అప్లోడ్ చేయాలని సూచించారు. దోపిడీ, దొంగతనాలు ఇతర రకాల నేరాలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవడంతో పాటు పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ఉండాలని అధికారులను ఆదేశించారు. దొంగతనాల నివారణకు రాత్రిపూట పెట్రోలింగ్ వ్యవస్థను, నిఘా వ్యవస్థను పటిష్ట పరచాలన్నారు. దొంగతనాల నివారణకు ప్రతి సర్కిల్ పరిధిలో ఒక స్పెషల్ టీం ను నియమించి వాటి నివారణకు కృషి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. నేర నియంత్రణ చర్యలలో కీలక పాత్ర పోషించే సిసి కెమెరాల ఏర్పాటు లో ప్రజలకు సీసీ కెమెరాల ఉపయోగలపై అవగాహన కలిగిస్తూ ప్రజలను, వ్యాపారులను భగస్వామ్యులను చేయాలని, జిల్లాలో ఎక్కడెక్కడ cc కెమెరాలు ఎన్ని ఉన్నాయి, ఎన్ని కెమెరాలు పని చేయు స్థితిలో ఉన్నాయి. ఇంకా ఎన్ని ప్రదేశాల్లో అవసరం ఉన్నాయో పూర్తి వివరాలు సేకరించాలని అన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రతి రోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ లు, వాహన తనిఖీలు నిర్వహించాలని,బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే ప్రాంతాల పై నిఘా ఉంచాలని వారి పై కేస్ లు నమోదు చేయాలని అన్నారు. జిల్లాలో గంజాయి,మత్తు పదార్థాలు పూర్తి స్థాయిలో నిర్మూలించేందుకు జిల్లా పోలీస్ యంత్రంగం ప్రత్యేక ప్రణాళికలను ఏర్పాటు చేసుకొని మండలాల్లో, గ్రామాల్లో నిత్యం తనిఖీలు నిర్వహించాలన్నారు. వివిధ జిల్లాల నుండి జిల్లాకు వచ్చే గంజాయి మూలలను,కీలక వ్యక్తులను గుర్తించి వారి పై కఠిన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రాసిక్యూషన్ లో భాగంగా కోర్టు వారు జారిచేసిన నాన్ బెయిలబుల్ వారెంట్లను నిందితులపై లేదా తప్పించుకుని తిరుగుతున్న నేరస్తులపై అమలుపరచడానికి అధికారులు అందరూ కృషి చేయాలని సూచించారు..లోక్ అదాలత్ దృష్ట్యా పోలీస్ అధికారులు రాజీ పడ దగిన కేసులను గుర్తించి ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి రాజీ పడేటట్లు అవగాహన కల్పించాలని సూచించారు.

### నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవడంతో క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం

జిల్లా పరిధిలో నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయాలకు పాల్పడే విక్రయదారులపై చట్టపరంగా చర్యలు తీసుకోవడంతో పాటు క్రిమినల్ కేసులను నమోదు చేస్తామని ఎస్పీ తెలిపారు. సీడ్స్ అండ్ ఫర్టిలైజర్స్ షాప్ యజమానులు నిబంధనలకు లోబడి వ్యాపారాలు చేసుకోవాలని, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు రైతులకు అందించాలని సూచించారు. మార్కెట్లో బిటి3 పత్తి విత్తనాలకు ఎలాంటి పర్మిషన్ లేదని చెబుతూ అనుమతి లేని విత్తన విక్రయాల దారులవద్ద విత్తనాలు కొనుగోలు చేయవద్దని సూచించారు. విత్తనా డీలర్లుల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయలని, తప్పనిసరిగా బిల్ అడిగి తీసుకోవాలని తెలిపారు. గ్రామాల్లోకి వచ్చి విత్తనాలు.అమే వారి వద్ద విత్తనాలు కొనుగోలు చేయవద్దని తెలిపారు, ఎవరైనా గ్రామాల్లో కి వచ్చి విత్తనాలు అమ్ముచుంటే ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేదని వాటిని కొన వద్దని సూచించారు. గ్రామాల్లోకి వచ్చి ఎవరైనా విత్తనాలు అమ్మితే కొనుగోలు చేయ వద్దని వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్లకు/వ్యవసాయ అధికారుల కు తెలపాలని లేదా డయల్ 100 కాల్ చేసి తెలిపినచో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని గారు తెలిపినారు. నకిలీ విత్తనాల నివారణ కోసం స్పెషల్ టాస్క్ ఫోర్స్ టీం ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ టీం జిల్లాలో వ్యవసాయ అధికారుల సహాయంతో అన్ని ఎరువుల దుకాణంలో తనిఖీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో డీఎస్పీలు రవీంధ్ర కుమార్, రఘు చందర్, ఉమామహేశ్వర రావు, రంగా రెడ్డి, వ్యవసాయ అధికారులు, ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు

## బాధితుడికి ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/బోథ్ :** బిఆర్ఎస్ కార్యకర్త సోహెల్ తండ్రి ఖలీల్ అహ్మద్ ప్రమాద వశాత్తు చెట్టు మీద నుంచి పడటంతో వెన్నుపూస విరిగింది. విషయం తెలుసుకున్న ఎంపిపి తుల శ్రీనివాస్ ఆసుపత్రికి వెళ్ళి పరామర్శించారు.డాక్టర్ తో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. అలాగే వైద్య ఖర్చులను తక్కువ చేయించారు. అనంతరం రూపాయలు 10 వేలు ఆర్థిక సహాయం అందించారు.బిఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఎంపిపి వెంట సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు అల్లకొండ ప్రశాంత్, ఇష్తకార్ పాల్గొన్నారు.

## బాధితులను ఆదుకుంటాం

**ప్రజాపక్షం/బోథ్ :** ప్రకృతి వైపరిత్యాల కారణంగా ఏర్పడిన నష్టాన్ని ప్రజలు,అధికారుల సమన్వయంతో పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ బోథ్ అసెంబ్లీ ఇంచార్జి ఆడె గజేందర్ అన్నారు. ఈదురు గాలులు, వానలకు నష్టపోయిన రైతులను, ఇండ్లు కూలి, ధ్వంసమైన ఇండ్లను మర్లపల్లి, నేరేడుపల్లి గ్రామాలలో కాంగ్రెస్ నాయకులతో పరిశీలించారు. వర్షాల వల్ల దెబ్బతన్న ఇండ్ల స్థానంలో నూతనంగా ఇందిరమ్మ ఇండ్లు వచ్చేందుకు కృషి చేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, నాయకులు పసుపుల చంటి, ప్రఫూల్ చందర్ రెడ్డి,రాజు యాదవ్, అబ్రర్, సాయన్న, గడ్డల నారాయణ, రహీమొద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి



**ప్రజాపక్షం/ఇచ్చోడ :** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కేటాయించిన పనుల లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలనీ స్థానిక ఎంపీడీవో కొండ లక్ష్మ ణ్ అన్నారు. శుక్రవారం మండలంలోని గేర్జం గ్రామంలో ఉపాధి హామీ ఫార్మ్ ఫాండ్ పనులను అకస్మికంగా ఎంపీ డీవో సందర్శించారు. ఉపాధి హామీ పనులను పూర్తి చేయడంలో ఈజీ ఎస్ సిబ్బంది పోటీతత్వంతో పని చేయాలనీ పేర్కొన్నారు. గ్రామాల్లో అపరిశుభ్రత నివారణకు పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు.

## బైండోవర్ అతిక్రమించిన మహిళకు జరిమానా



**ప్రజాపక్షం/జగిత్యాల జిల్లా ప్రతినిధి :** అర్బన్ గాంధీనగర్‌లో నాటుసారా అమ్ముతూ పట్టుబడిన జూపల్లి రాజవ్వ అనే మహిళ పై జగిత్యాల ఎక్సైజ్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి తహసీల్దార్ ముందర ఒక సంవత్సర కాలానికి బైండోవర్ చేయగా, ఆమె బైండోవర్ నీ అతిక్రమిస్తు మరల గుడుంబా అమ్మడంతో ఆమెను ఎక్సైజ్ సిబ్బంది జగిత్యాల అర్బన్ తహసీల్దార్ ముందర హాజరు పర్చారు. ఆమెకు 50,000 రూపాయలు జరిమానా విధించిగా, జరిమానా చెల్లించింది. ఈ సందర్భంగా జగిత్యాల అబ్కారీ సీఐ సర్వేష్ మాట్లాడుతూ జగిత్యాల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఎవరైనా నాటుసారా తయారు చెయ్యడం, కలిగి ఉండటం, అమ్మడం, రవాణా చెయ్యడం, నాటుసారా తయారీకి ముడిసరుకు రవాణా చేసినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఎన్‌జిటి తీర్పు హర్షణీయం

### ఇసుక మాఫియాపై ఉక్కుపాదం మోపండి



**ప్రజాపక్షం/జమ్మికుంట :** గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పిదాలపై అధికారులు, నాయకులు ఒక్కొక్కరుగా మూల్యం చెలించుకోవాల్సిన సమయం వచ్చిందని జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి పేర్కొన్నారు. మానేరు నదిలో ఇసుక తవ్వకాలు చట్ట విరుద్ధమని నేడు ఎన్జీటి తీర్పులో పేర్కొనడం హర్షణీయమన్నారు. గత ప్రభుత్వం ఇసుక మాఫియాతో కుమ్మక్కై వేల కోట్ల రూపాయల అక్రమార్కులకు పాల్పడిందని ఆయన పేర్కొన్నారు. డీసిల్టేషన్ పేరుతో జరిగిన అక్రమాలకు వ్యతిరేకంగా తాను రైతాంగం పక్షాన ఉద్యమించానని ఆయన గుర్తుచేశారు. గత ప్రభుత్వం అండదండలతో మానేరులో ఇసుక విధ్వంసానికి పాల్పడుతూ కాంట్రాక్టర్లు వేల కోట్ల అక్రమార్జకు పాల్పడి తీర ప్రాంత రైతాంగ ఉపాధులను దారుణంగా దెబ్బతీశారని వాపోయారు. ఇసుక కాంట్రాక్టర్ల వేల కోట్ల అక్రమార్జనలను తాను సాక్ష్యాలతో సీఎంకు అందజేశానని, విచారణ జరుగుతున్నదని తెలిపారు. ఎన్జీటీ ఇచ్చిన తీర్పు గత ప్రభుత్వానికి చెంప పెట్టనని తెలిపారు. ఎన్జీటీ తీర్పు నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి గతంలో తనుగుల వద్ద ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఇసుక మాఫియాపై ఉక్కుపాదం మోపాలని, అంతేకాకుండా ఎన్జీటి విధించిన రూ.50 కోట్ల జరిమాన అక్రమాలకు పాల్పడిన అధికారుల నుంచి వసూలు చేసి మానేరు తీర ప్రాంత బాధిత రైతాంగానికి నష్టపరిహారంగా చెల్లించలని కోరారు. ఇసుక మాఫియాకు వ్యతిరేకంగా పోరాడిన ఉద్యమకారులపై గత ప్రభుత్వం నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేయాలని సీఎం రేవంత్ రెడ్డికి విన్నించారు. మొక్కవోని ధైర్యంతో న్యాయపోరాటాన్ని కొనసాగించి విజయం సాధించిన మానేరు పరిరక్షణ సమితి నాయకులు సురేందర్‌రెడ్డి, సతీష్ కుమార్‌లను ఆయన అభినందించారు.

## ప్రశాంతంగా ముగిసిన మొదటి రోజు ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు

**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి :** జగిత్యాల జిల్లాలో ఏర్పాటు చేయబడ్డ 19 పరీక్షా కేంద్రాలలో ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా ముగిసినాయి. ఉదయం జరిగిన ప్రథమ సంవత్సర ద్వితీయ భాష పరీక్షలో 1334 మంది విద్యార్థులకు గాను 12 43 మంది విద్యార్థులు హాజరైనారు 91 మంది విద్యార్థులు గైర్ హాజరైనారు. మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సర ద్వితీయ భాష పరీక్షలో 665 మంది విద్యార్థులకు గాను 633 మంది విద్యార్థులు హాజరైనారు 32 మంది విద్యార్థులు గైర్హాజరైనారు. రేపు జరగబోయే ఇంగ్లీష్ ప్రథమ సంవత్సర పరీక్షకు విద్యార్థులందరు సకాలంలో హాజరుకావాలని ఐదు నిమిషాలు ఆలస్యం అయితే లోనికి అనుమతించబడరని పరీక్షల కన్వీనర్ శ్రీ బి. నారాయణ తెలిపారు. దూర ప్రాంత విద్యార్థులు ప్రథమ సంవత్సర పరీక్ష వ్రాసేవారు 8 గంటల 30 నిమిషాల వరకు పరీక్షా కేంద్రం చేరుకోవాలని మధ్యాహ్నము ద్వితీయ సంవత్సర పరీక్ష రాసే విద్యార్థులు రెండు గంటల వరకు పరీక్షా కేంద్రాన్ని చేరుకోవాలని వారికి కేటాయించిన సీట్ లో కూర్చోవాలని తమ వెంట మొబైల్ ఫోన్ కానీ క్యాలిక్యులేటర్స్ కానీ ఇతర ఎలక్ట్రానిక్ డివైసెస్ తీసుకొని రాకూడదని మరియు ఎలాంటి ప్రింటెడ్ మెటీరియల్ తమ వెంట తీసుకొని రాకూడదని ఈ సందర్భంగా తెలియజేశారు. ఎవరు కూడా ఆందోళన చెందకూడదని ఆందోళన చెందే విద్యార్థులు టెలి మానస్ 14416కు ఫోన్ చేసి ఆందోళన తగ్గించుకునే ప్రయత్నం చేయాలని సూచించారు.

## జనగామ జిల్లాకు సర్వాయిపాపన్న పేరు ఆమోదించడం పట్ల హర్షం



**ప్రజాపక్షం/చిగురుమామిడి :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జనగామ జిల్లాను సర్దార్ సర్వాయి పాపన్న జిల్లాగా ప్రకటించడం పట్ల బిసి సంక్షేమ సంఘం నాయకులు హర్షం వెలిబుచ్చారు. రాష్ట్ర చరిత్రలోనే మొట్టమొదటి బహుజన చక్రవర్తి సర్వాయి పాపన్నకు గుర్తుగా రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలుపడం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్‌లతో పాటు కేబినెట్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ సంధర్భంగా జడ్పి ఫ్లోర్ లీడర్, బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గీకురు రవీందర్ శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అనన్య సామాన్యమైన తెగువకు తెగింపుకు మారుపేరుగా మొక్కవోణి ధైర్యశాలిగా వెట్టిచాకిరీ విముక్తి కోసం బానిస బ్రతుకుల బాగు కోసం పాపన్న ఉద్యమించిన తీరు తెలంగాణ ప్రజలకు స్పూర్తిదాయకమన్నారు. బహుజన రాజ్యాధికారం కోసం కుల వృత్తుల వారితో స్వంత సైన్యాన్ని ఏర్పాటు చేసుకుని మొగులాయిలపై గెరిల్లా యుద్ధం చేసి గోల్కొండ ఖిల్లాను ఏలిన బహుజన చక్రవర్తిగా పేరు ప్రఖ్యాతలు గడించిన విప్లవ వీరుడన్నారు. పాపన్న వీర గాధ భవిష్యత్తు తరాలకు, యువతకు స్పూర్తిదాయకమన్నారు. బిసి సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు శ్రీరామోజు రాజ్ కుమార్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్ర శ్రీనివాస్, బిసి సంఘం నాయకులు తాళ్లపెల్లి తిరుపతి, బిసి సంఘం యువత విభాగం ప్రధాన కార్యదర్శి గట్టు ప్రశాంత్ ముదిరాజ్ తదితరులున్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలించిన జువ్వాడ



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** కోరుట్ల నియోజకవర్గంలోని ఇబ్రహీంపట్నం మండలం యామాపూర్ గ్రామంలో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు జువ్వాడి కృష్ణారావు శుక్రవారం పరిశీలించారు. ధాన్యం కొనుగోలు సక్రమంగా జరుగుతున్న విషయాన్ని రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు ధాన్యం కొనుగోలు సక్రమంగానే ఉందని, కానీ లారీల కొరత ఉందని కృష్ణారావుకు చెప్పడంతో అక్కడిక్కడే అధికారులతో ఫోన్ ద్వారా సంప్రదించి తగు చర్యలు తీసుకోవాల్సిందిగా, వెంటనే లారీలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని తరలించాల్సిందిగా అధికారులను కృష్ణారావు కోరారు. అనంతరం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు కాస చిన్న రమేష్ కూతురు నూతన వస్త్రాలంకరణ కార్యక్రమంలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమాలలో కృష్ణారావు వెంట స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు జిల్లా కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ అధ్యక్షులు జలపతి రెడ్డి, కోరుట్ల నియోజకవర్గ యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏలేటి మహిపాల్ రెడ్డి, కోరుట్ల బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పెరుమాండ్ల సత్యనారాయణ, దామెర శ్రీనివాస్, కనక నాగేష్, కాస సంజీవ్, కాశ ప్రశాంత్, దశరథం, గణేష్, మహేష్, విష్ణు తదితరులు ఉన్నారు

## మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్‌లో నాణ్యమైన విద్య



**ప్రజాపక్షం/మెట్ పల్లి :** మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్లో పిల్లలను చేర్పించి వారి భవిష్యత్తు తీర్చిదిద్దాలని ప్రిన్సిపాల్ తిరుపతి అన్నారు. శక్రవారం మెట్ పల్లి పట్టణంలో మక్కా మసీద్ వద్ద నమాజ్ చదివి వెళ్లున్న ప్రతి మైనార్టీ సోదరులకు తమ పిల్లలను మైనార్టీ స్కూల్లో చేర్పించాలని వారు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలకు మంచి విద్యతో పాటు ఆహారం, క్రికెట్, కబడ్డీ, ఆడేందుకు ప్లే గ్రౌండ్ ఉన్నాయని అన్నారు. అడ్మిషన్లు ప్రారంభం అయ్యాయి వెంటనే తమ పిల్లలను మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ లో చేర్పించాలని ఈ అవగాహన సందస్సు ఏర్పాటు చేశామని ఈ సందర్భంగా తెలియజేశారు.

## ప్రమాదాలకు నిలయంగా సీడ్ ప్లాంట్

**ప్రజాపక్షం/శంకరపట్నం :** ధాన్యం ప్రాసెసింగ్ చేసే క్రమంలో సీడ్ ప్లాంట్ నుంచి వెలువడే దుమ్ము దూళి వ్యర్థాలు బయటకి రావడంతో రోడ్డు ప్రమాదాలకు కారణమవుతోంది. ఫలితంగా ఆ దారిలో రోడ్డుపై ప్రయాణిస్తున్న వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్న సంఘటనలు కోకొల్లలుగా జరుగుతున్నాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు ఏ మాత్రం పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలో మొలంగూర్ ఎక్స్ రోడ్ నుంచి వీణవంక వెళ్లే ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న శ్రీ చైతన్య సీడ్ ప్లాంట్ యాజమాన్యం నిబంధనలను పాటించకుండా సీడ్ ప్లాంట్‌ను నిర్వహిస్తున్నారు. ధాన్యం ప్రాసెసింగ్ చేసే క్రమంలో అందులో నుంచి వెలువడే వ్యర్థాలు దుమ్మూదూళి గాలిలో కలవడం వలన ప్రజలకు శ్వాస కోశ వ్యాధులు సంభవించే అవకాశం ఉందని పలువురు వైద్య నిపుణులు సూచిస్తున్నారు. అంతే కాకుండా బ్లోయర్ల ద్వారా వెలువడే వ్యర్థాలు రోడ్డుపైకి రావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. మరోసారి ప్రాణాలు కోల్పోయే భారీ ప్రమాదాలు సంభవిస్తే గానీ అధికారులు స్పందించరా? ప్రాణాలు పోతున్నా.. అవిటి వారవుతున్నా.. పట్టించుకోరా? అని ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నత అధికారులు స్పందించి శ్రీ చైతన్య స్పీడ్ ప్లాంట్‌పై తనిఖీ చేసి క్షేత్రస్థాయిలో పరిశీలించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## పచ్చిరొట్ట విత్తనాలను సద్వినియోగం చేసుకోండి

**ప్రజాపక్షం/గంగాధర :** ప్రభుత్వం రాయితీతో అందించే పచ్చిరొట్ట విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని గంగాధర మండల వ్యవసాయ అధికారి బండ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ వానాకాలం పంటలకు సంబంధించి పచ్చిరొట్ట నలభై క్వింటాళ్లు జీలుగు విత్తనాలు గంగాధర ఎక్స్‌రోడ్డులోని కెడిసిఎంఎస్2లో అందుబాటులో ఉన్నాయని అన్నారు. ముప్పై కిలోల బస్తాకు సబ్సిడీ పోను రూ.1116 రూపాయలని, ఒక బస్తా రెండు ఎకరాల ఇరవై గంటలకు సరిపోతుందన్నారు. పచ్చిరొట్ట సాగుతో భూసారం పెరుగుతుందని, ఇందుకు తొలకరిలో విత్తనాలు చల్లుకోవాలని సూచించారు. విత్తనాలు కావాల్సిన వారు తమ వెంట పట్టాదారు పాసు బుక్ జిరాక్స్ ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకురావాలని తెలిపారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు



**ప్రజాపక్షం/ఇల్లందకుంట :** రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి రజిత అన్నారు. శుక్రవారం ఇల్లందకుంట మండలంలోని ఇల్లందకుంట, సిరిసేడు గ్రామాలలోని ఫర్టిలైజర్ దుకాణాలను ఇల్లందకుంట పోలీసుల ఆద్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ ఫర్టిలైజర్ షాపులో వారు తప్పనిసరిగా స్టాక్ రిజిస్టర్లు, బిల్‌బుక్‌లు, మెయింటెనెన్స్ చేయాలని తెలిపారు. అనంతరం రైతు వేదికలో సీడ్స్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. రైతులకు నాణ్యమైన సీడ్స్ అందజేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రవీందర్, ఏఏవోలు తిరుపతి, రాకేష్, సంపత్, మమతతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ఫర్టిలైజర్ దుకాణాలు తనిఖీ చేసిన ఏసిపి



**ప్రజాపక్షం/జమ్మికుంట :** రైతుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హుజురాబాద్ ఏసిపి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం జమ్మికుంట పట్టణంలోని ఫర్టిలైజర్ షాప్‌లపై ఏసిపి శ్రీనివాస్ జి, వ్యవసాయ అధికారి గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఫర్టిలైజర్ షాప్‌ల స్టాక్ రిజిస్టర్లు బిల్లు బుక్కులు తదితర వివరాలు సేకరించారు. షాపులో ఉన్న విత్తనాలు పరిశీలించి నకిలీ విత్తనాలు అమ్మేవారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ నకిలీ విత్తనాలు షాపులో విక్రయిస్తున్నారని సమాచారం మేరకు దాడులు నిర్వహించామని తెలిపారు. రైతులు నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా సమాచారం ఉంటే పోలీసులకు , వ్యవసాయ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. జమ్మికుంట సిఐ రవి, వ్యవసాయ అధికారులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ఏకగ్రీవంగా సిర్పూర్ టి ఎంపిపి ఎన్నిక



**ప్రజాపక్షం/సిర్పూర్ టి :** సిర్పూర్ టి మండలం కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ఎన్నికను శుక్రవారం రోజున ఆర్‌డిఒ సురేష్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. సిర్పూర్ టి ఎంపిపి పై గతంలో పెట్టిన అవిశ్వాస తీర్మాణం నెగ్గడంతో ఖాళీ అయిన ఎంపిపి స్థానానికి శుక్రవారం ఎన్నిక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండలంలో మొత్తం ఎనిమిది మంది ఎంపిటిసిలు ఉండగా ఏడుగురు ఎంపిటిసి సభ్యులు సమావేశానికి హాజరై ఏకగ్రీవంగా ఈర్త సత్యనారాయణను ఎంపిపిగా ఎన్నుకున్నట్టు ఆర్‌డిఒ సురేష్ బాబు తెలిపారు. ఎంపిపి ఎన్నిక సమావేశానికి ఎస్ఐ ఢీ కొండ రమేష్ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

## వికసించిన మే పుష్పం



**ప్రజాపక్షం/మందమర్రి :** ప్రతీ ఏటా మే నెలలో ప్రకృతి ప్రియులను అలరించే మే పుష్పం వికసించింది. పట్టణంలోని యాపల్ పాత పోలీస్ స్టేషన్ ఏరియాలోని దండవేణి ఐలయ్య నివాసంలో మే పుష్పం వికసించింది. కాలనీవాసులు ప్రజలు దీనిని చూసేందుకు ఆసక్తి కనబరిచారు. ఏడాదిలో ఒక్కసారే వికసించే ఈ మే పుష్పం అందరినీ ఆకట్టుకుంటుంది. మే నెల రాగానే ఈ పుష్పం కోసం అనేక మంది ప్రకృతిని ఆస్వాధించే వారు ఆసక్తిగా ఎదురు చూస్తారు. కేవలం మే మాసంలోనే వికసించే ఈ పుష్పం వారం రోజులు వరకు మాత్రమే ఉంటుందని ప్రకృతి ప్రేమికులు తెలిపారు.

# పాఠశాలలు ప్రారంభమయ్యే లోపు మౌలిక సౌకర్యాలు కల్పించండి

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** గత ప్రభుత్వం మాదిరిగి ఈ ప్రభుత్వం కూడా విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేయకుండా పాఠశాలల ప్రారంభం నాటికి అన్ని రకాల సౌకర్యాలు కల్పించేందుకు కఠినమైన చర్యలు వెంటనే చేపట్టి విద్యారంగ అభివృద్ధికి కృషి చేయాలని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీయూటీఎఫ్) రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు ఏ.మురళీ మనోహర్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.శుక్రవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంల వీరు మాట్లాడుతూ..మూతబడిన పాఠశాలలను తెరిపించాలని,అన్ని పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు.అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ(ఏఏపీసీ)పాఠశాలలతో పాటు,మన ఊరుమన బడి పనులు వేగవంతం చేసి పాఠశాలల ప్రారంభం నాటికి పూర్తి అయ్యేట్లు తగుచర్యలు తీసు





కోవాలని,ప్రాథమిక పాఠశాలల్లో తరగతికి ఒక ఉపాధ్యాయుడు ప్రతి తరగతికి ఒక గది ఉండేటట్లు చర్యలు తీసుకోవాలని తెలిపారు.బదిలీ పొంది విడుదల కాని ఉపాధ్యాయులను వెంటనే విడుదల చేయాలని వారి స్థానంలో రెగ్యులర్ ఉపాధ్యాయులు వచ్చే వరకు విద్యా వాలంటీర్లను నియమించాలని ఆయన డిమాండ్ చేశారు. నిలిచిపోయిన బదిలీలు పదోన్నతుల ప్రక్రియను వెంటనే చేపట్టాలని, ప్రతి పాఠశాలకు ఒక పారిశుద్ధ్య కార్మికుడు,ఒక నైట్ వాచ్మెన్ ను నియమించాలని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు రెగ్యులర్ డి.ఇ.ఓలు, అన్ని మండలాలకు రెగ్యులర్ ఎంఈఓలు ఉండునట్లు జీవో 2018 ననుసరించి నూతన సర్వీస్ రూల్స్ రూపొందించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తోడిశెట్టి రవికాంత్,వహీద్ ఖాన్, జిల్లా కోశాధికారి పోల ధర్మరాజ్, ఎ. లక్ష్మి ప్రసాద్ రెడ్డి, వివిధ మండలాల బాధ్యులు మొయిజుద్దీన్, మతీన్, లక్ష్మారెడ్డి, శివప్రసాద్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ విద్యాసంస్థలో చేరండి : ఎన్ఎస్‌యుఐ

**ప్రజాపక్షం/బైంసా :** ప్రభుత్వ విద్యాసంస్థలో చేరాలని ఎస్ఎస్‌యుఐ జిల్లా కార్యనిర్వహక అధ్యక్షులు ఆంజద్ షేక్ పిలుపునిచ్చారు. ముధోల్ నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలో చేరి విద్యార్థులు బంగారు భవితకు బాటలు వేయాలని కోరారు ప్రభుత్వ విద్యా సంస్థల్లో చేరే విద్యార్థులకు అపారమైనటువంటి జ్ఞానము అందించబడుతుందని అనుభవజ్ఞులైనటువంటి అధ్యాపకులచే బోధన అందిచబడుతుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చినప్పటి నుంచి విద్యారంగానికి పెద్దపీట వేసి ప్రభుత్వ విద్య వ్యవస్థను బలపితం చేసే విధంగా అడుగులు వేస్తుందని బైంసా, కుబీర్, ముధోల్, తానురు తదితరమండలంలో ప్రభుత్వ జూనియర్, మండల కేంద్రంలో ఉన్నటువంటి డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ తీసుకుని అనుభవిజ్ఞులచే బోధనను పొంది. విద్యార్థులు ఉన్నత శిఖరాఉల అధిరోహించాలని కోరారు.

బైంసా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పిహెచ్‌డీ చేసినటువంటి బోధన సిబ్బంది ద్వారా క్లాసులు నిర్వహించబడతాయని, అధునాతమైనటువంటి కంప్యూటర్ ల్యాబ్ నెలకోల్ప బడిందని, గతంలో జాతీయ స్థాయిలో మూడు జాతీయ సెమినార్లు నిర్వహించినటువంటి ఘనత ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందుతుందని నాయక్ బి గ్రేడ్ చెందినటువంటి కళాశాలలో దోస్త్ వెబ్సైట్ ద్వారా ప్రవేశలు పొందవచ్చని కోరారు.

## ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం నియామకం



**ప్రజాపక్షం/మందమర్రి :** మందమర్రి పట్టణ ప్రెస్ క్లబ్ నూతన పూర్తి కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగిందని ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గాండ్ల సంజీవ్, ప్రధాన కార్యదర్శి కడారి శ్రీధర్, కోశాధికారి బూర్ల రాజ్ కుమార్‌లు తెలిపారు. ఈ మేరకు గురువారం ప్రెస్ క్లబ్ లో క్లబ్ పూర్తి స్థాయి కమిటీని నియమించి, సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు. ప్రెస్ క్లబ్ గౌరవ సలహాదారులుగా వాసాల లింగయ్య, కొక్కుల సారంగపాణి, జాడి ముకుందం, గౌరవ అధ్యక్షులుగా తేళ్ల విజయ్ కుమార్, మాదాసు కుమారస్వామి, కార్యనిర్వాహక అధ్యక్షులుగా తులసీ శ్రీనివాస్, కుర్రె శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా ఉప్పులేటి నరేష్, సకినాలు శంకర్, సయ్యద్ వజీర్, పల్లె సమ్మయ్య, సంయుక్త కార్యదర్శులుగా కున్సోత్ సంపత్, కుమ్మరి రమేష్, ప్రచార కార్యదర్శులుగా ఎండి హుస్సేన్, మర్రి దేవేందర్, జాడ క్రాంతికుమార్, కార్యవర్గ సభ్యులుగా మర్రి శ్రీకాంత్, ఎండి అక్బర్, చిలుక సంజీవ్, ఇప్ప వెంకటేష్, క్లబ్ ఇంచార్జ్ గా శ్రీ రామోజు సంతోష్ చారీ లను నియమించారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బాసర అమ్మవారి ఆలయంలో భక్తుల సందడి



### సరస్వతి నమో నమః నామ స్మరణతో మార్మోగిన ఆలయం..

**ప్రజాపక్షం/బాసర :** నిర్మల్ జిల్లా లోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం బాసర ఆలయంలో శుక్రవారం అమ్మవారి రోజు శుభదినం కావడం తో భక్తుల రద్దీ నిండుగా కనిపించింది.తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాల నుండి భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయాధికారులు ఏర్పాట్లు చేశారు.ఆలయ ఈవో విజయరామరాజు ఆలయ సిబ్బంది తో కలిసి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించారు. ఆలయం తరుపున క్యూలైన్ లలో నిలబడిన చిన్నారులకు భక్తులకు మంచినీటి తో పాటు మజ్జిగ పంపిణి చేశారు. అమ్మవారిని శుక్రవారం సిద్దిపేట డిస్టిక్ సెషన్ జడ్జి సాయి రమాదేవి కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం ముదు గంటలకు శ్రీమతి అరోమా సింగ్ ఠాకూర్ ఐఆర్‌పిఎఫ్ఎస్ఐజి కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఈమెతో పాటు ఆర్‌పిఎఫ్ హైదరాబాద్ ఎస్‌సి అనూప్ శుక్ల, ఆర్పీఎఫ్ ధర్మాబాద్ ఎఎస్ఐ రమాశీష్, హెడ్ కానిస్టేబుల్ వాఫ్ మారే తో పాటు బాసర మండల ఎంపిపి సునీత విశ్వనాత్ పటేల్,ఆలయ ఈవో విజయ రామరాజు ఉన్నారు. ప్రముఖులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అనంతరం షాలువాతో సత్కరించారు.ఆలయ వైదిక సిబ్బంది తీర్థ ప్రసాదాలను అందించారు.

## పకడ్బందీగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** జిల్లా కేంద్రాంలో ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు పకడ్బందీగా ప్రశాంత వాతావరణంలో శుక్రవారం ఉదయం ప్రారంభం అయ్యాయి. ప్రథమ సంవత్సరం ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలకు జిల్లాలో మొత్తం 3,416 విద్యార్థులు హాజరు కావలసి ఉంది.పరీక్ష కేంద్రాల వద్దద ముందస్తుగా జిల్లా ఇంటర్మీడియట్ బోర్డ్ అధికారులు 144 సెక్షన్ ఏర్పాటు చేశారు.జిల్లాలో మొత్తం 13 కేంద్రాలను ఏర్పాటు చేయగా పరీక్షలు రాసేందుకు వచ్చిన విద్యార్థులను పరీక్ష కేంద్రంలోనికి అనుమతి ఇచ్చారు.ఉదయం ప్రథమ సంవత్సరం విద్యార్థులు పరీక్షలు రాస్తుండగా మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పరీక్షలు రాస్తారు. జిల్లా ఇంటర్మీడియట్ బోర్డ్ పర్యవేక్షణ అధికారి జాదవ్ పరుశురాం మాట్లాడుతూ జిల్లాలోని 13 కేంద్రాలలో కూడా విద్యార్థులకు ఎలాంటి ఆసౌకర్యాలు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయడం జరిగిందని చెప్పారు.

పరీక్ష కేంద్రాలను సంబంధిత ఇంటర్మీడియట్ బోర్డ్ అధికారులతో పాటు జిల్లా కలెక్టర్, స్థానిక తహశీల్దార్ ఇతర అధికారులు కూడా పర్యవేక్షింస్తారని చెప్పారు.

## విత్తనాలు కొనుగోలుపై అవగాహన

**ప్రజాపక్షం/సోన్ :** మండలంలోని కూచన్ పల్లి గ్రామంలో శుక్రవారం వ్యవసాయ అధికారులు రైతులకు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.వీరు మాట్లాడుతూ.విత్తనాలు తీసుకునే సమయములో డీలర్ దగ్గర్ నుండి తీసుకొని పంట దిగుబడి వచ్చేవరకు పంట కాలం పూర్తి అయే వరకు దగ్గర భద్ర పరుచుకోవాలి.తీసుకున్న రసీదు మీద విత్తన కంపెనీ పేరు,రకము,బ్యాచ్ నంబర్,లాబ్ నంబర,రేటు ఉండాలి.విత్తన పాకెట్ మీద తయారు అయినా తేది,కాలం ముగిసిన తేది చూసుకోవాలి.గ్రామ లలో తక్కువ,ఎక్కువ ధరకు అమ్మే వారి వివరాలు వ్యవసాయ అధికారులకు చెప్పాటి.దయ చేసి తొందర పడి లైసెన్స్ లేని డీలర్ దగ్గర వితనాలు తీసుకొని ఇబ్బంది పడవద్దు అని వానాకాలపు పంటలపై పచ్చి రొట్ట ఎరువులపై అవగాహన కార్యక్రమం కల్పించడం జరిగింది.కార్యక్రమంలో ఏఈఓ అంబాజీ,రైతులు,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## గ్రామస్తుల ధాతృత్వం



**ప్రజాపక్షం/చందుర్తి :** మండలంలోని మల్యాల గ్రామానికి చెందిన బంటు ఆనందం గత కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా అతడి కుటుంబానికి అండగా నిలిచారు. మృతుడిది నిరుపేద కుటుంబం, ఇద్దరు చిన్నపిల్లలు ఉండడంతో చలించిపోయిన గ్రామస్తులు 18500 రూపాయల ఆర్థిక సహాయాన్ని శుక్రవారం ఆ కుటుంబానికి అందజేసి దాతృత్వాన్ని చాటుకున్నారు. ఆపదలో ఉన్నవారికి అనునిత్యం అండగా నిలిచే వివేకానంద సేవా సమితి సభ్యులు రెండు వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

### ఎన్ఆర్ఐల చేయూత

ఉపాధి నిమిత్తం సౌదీ వెళ్లిన పొలాస అంజయ్య, పొలాస శంకర్ లు బంటు ఆనందం మృతి గురించి తెలుసుకొని 5000 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన వారికి దాతలు సహకారం అందజేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో మందాల అబ్రహం, గౌర్రె నందు, మాదం బాబు, పాటి సుధాకర్, లోకోజు సతీష్, కొడగంటి గంగాధర్, పొలాస సంతోష్, మాదాడి కరుణాకర్ రావు, గొంటి క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

## గొర్రెలమందపై కుక్కల దాడి..



**ప్రజాపక్షం/సోన్ :** మండలంలోని కడ్తాల్ గ్రామంలో గొర్రెల మందపై శుక్రవారం వీది కుక్కలు దాడి చేశాయి.బాధితుడు అరిగేల వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం.ఉదయం తన గొర్రెలను మేత కోసం బయటకు తీసుకెళ్ళాడు.మరికొన్నింటిని ఇంతటి సమీపంలో షెడ్డులో ఉండిపోయాయి.ఈ క్రమంలో మధ్యాహ్నం ఒక్క వీధి కుక్కలు మందలోకి చొరబడి గొర్రెలపై దాడి చేయడం ఆరు జీవాలు మృత్యువాతపడ్డాయి.సుమారు రూ.35వేలు నష్టం జరిగిందని బాధితుడు బోరున విలపించాడు.గ్రామంలో పరుస సంఘటనలు చోటు చేసుకోవడంతో గొర్రెల కాపరులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.గత రెండు నెలలుగా గొర్రెల మందలపై వీధి కుక్కలు దాడి చేయడంతో సూమారు 30 మృత్యువాత పడ్డాయి. గ్రామంలో వీధి కుక్కలను అరికట్టాలని గతంలో అధికారులకు విన్నవించిన పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వీధి కుక్కల బెడద అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# రైతులకు బేడీలు వేసిన ఘనత బిఆర్ఎస్‌దే



ప్రజాపక్షం/కరీంనగర్ : బిఆర్ఎస్ ప్రభుత్వం నూతనంగా కొలువుదీరిన మూడు నెలల్లోనే ఖమ్మంలో రైతులకు బేడీలు వేసి నడిరోడ్డుపై నడిపించినప్పుడు జాతీయ మీడియా సంస్థలో ప్రచురితమైతే హరీష్‌రావు, కెటిఆర్‌తో పాటు బిజెపి కిషన్ రెడ్డి ఎందుకు స్పందించలేదని జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ బిసి సెల్ అధ్యక్షుడు పులి ఆంజనేయులు గౌడ్ ప్రశ్నించారు. డిసిసి కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. రైతులకు బేడీలు వేసిన ఘనత బిఆర్ఎస్‌దేనని, ఆ పార్టీ నేతలు రైతుల కష్టాల గురించి మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. బిఆర్ఎస్ పాలనలో రైతన్నలు రుణమాఫీ, పంట నష్టం, ధాన్యం దోపిడీపై కెసిఆర్ ప్రభుత్వాన్ని నిలదీస్తూ కల్లాల్లో కంటే రోడ్లపైనే పడిగాపులు కాసారని ప్రశ్నించారు. అప్పుడు హరీష్‌రావు, కెటిఆర్ మొద్దు నిద్రలో ఉన్నారా? అని ప్రశ్నించారు. వారి పాలనలో రైతుల పరిస్థితి పేనం మీద నుంచి పోయిలో పడినట్లయ్యిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చే ఆరు నెలలు గడవక ముందే బిఆర్ఎస్ నేతలు రైతుల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్నారని పేర్కొన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన నల్ల చట్టాలను వ్యతిరేకించే క్రమంలో చేపట్టిన ఆందోళనతో 925 మంది రైతులు చనిపోయినప్పుడు కెటిఆర్ ఎందుకు స్పందించలేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, ప్రభుత్వం తెలుగుదీరిన సందర్భంలో పండిన ప్రతి గింజను కొనడం జరుగుతుందని, మొన్న జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో ఓటమి చెందబోతున్నారని ముందే గ్రహించి మతిభ్రమించి బిఆర్ఎస్ నేతలు రైతుల సమస్యల పట్ల రాజకీయం చేస్తున్నారని పేర్కొన్నారు. మాజీ సీఎం కెసిఆర్ కమీషన్ల కోసం కక్కుర్తి పడి తన ఇంజనీరింగ్ నైపుణ్యంతో నిర్మించామని చెప్పుకుంటున్న కాళేశ్వరం పూర్తిగా నిండకుండానే దెబ్బతినడం వల్ల ఏర్పడిన నీటి కొరతతో నేడు ప్రజలు కష్టాలు పడుతున్నారన్నారు. రైతుల పట్ల పక్షపాతిగా ఉన్న కాంగ్రెస్ నిర్మించిన భారీ నీటి పారుదల ప్రాజెక్టులు ఎన్ని వరదలు వచ్చినా చెక్కు చెదరలేదన్నారు. ఇది కాంగ్రెస్ పారదర్శక పాలనకు నిదర్శనమన్నారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు రామిడి రాజిరెడ్డి, నూనె గోపాల్ రెడ్డి, సిరికొండ శివ ప్రసాద్, జూపాక సుదర్శన్, చింతల ఎల్లారెడ్డి, గాలి అనిల్ కుమార్, కొత్తూరి ప్రమీల, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

## సూపర్ ఇండెంట్‌ను కలిసిన గౌడ సంఘ సభ్యులు

ప్రజాపక్షం/లక్ష్మణచందా: మండల గౌడ సంఘ సభ్యులు నిర్మల్ జిల్లా ఎక్సైజ్ సూపర్ ఇండెంట్ ఎంఏ రజక్ ను జిల్లా కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.సాలువ బొకేతో ఘనంగా సన్మానించారు.సూపరిండెంట్ తో పాటు ఎక్సైజ్ సీఐ సింధు ను కూడా సన్మానించడం జరిగింది.ఈ కార్యక్రమంలో గౌడ సంఘ సభ్యులు వేణు గౌడ్,గంగాధర్ గౌడ్,రమణ గౌడ్,రాజా గౌడ్,రాజేశ్వర్ గౌడ్,గౌడ్ సంఘ సభ్యులు ఎక్సైజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ కుటుంబానికి జీవన్ రెడ్డి పరామర్శ

ప్రజాపక్షం/గొల్లపల్లి : జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండలం రాఘవపట్నం గ్రామ మాజీ సర్పంచ్ కాసారపు అరవింద్ గౌడ్ తండ్రి కాసారపు రాజ లింగం గౌడ్ ఇటీవల అనారోగ్యంతో మరణించగా శుక్రవారం రాఘవపట్నం లోని వారి నివాసంలో మాజీ మంత్రి, నిజామాబాద్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి,ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కాసారపు రాజ లింగం గౌడ్ చిత్రపటానికి నివాళులు అర్పించి వారి కుటుంబాన్ని పరామర్శించడం జరిగింది. వారి వెంట సీనియర్ కాంగ్రెస్ నాయకులు మాజీ సర్పంచులు భీమా సంతోష్, రేవెళ్ళ సత్యనారాయణ గౌడ్, నేరెళ్ళ రాజిరెడ్డి, గడ్డం తిరుపతి రెడ్డి ,గోపాల్ రెడ్డి, గొల్లపెల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నేరెళ్ళ మహేష్, బోనగిరి నాగరాజు, కాళ్ళ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ ప్రవేశాలకు నేటితో ఆకరి గడువు

ప్రజాపక్షం/గొల్లపల్లి : జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్స్ లో 2024 25 విద్యా సంవత్సరానికి గాను ఆన్లైన్లో దరఖాస్తు గడువు నేటితో ముగియనుంది. ఈనెల 10 నుంచి 25 వరకు ఆన్లైన్లో దరఖాస్తుల స్వీకరణకు నోటిఫికేషన్ వెలువడింది. పదో తరగతిలో సాధించిన జి పి ఏ ఆధారంగా మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, కాలేజీలో ఎంపీసీ, బైపిసి, సీఈసీ, ఎం ఈ సి గ్రూపులలో 40 చొప్పున సీట్లు ఉన్నాయని, ఆసక్తిగల విద్యార్థినీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని, అమ్మాయిలకు హాస్టల్ వసతి సౌకర్యం కలదు. ఎంపీసీ, బైపిసి విద్యార్థులకు ఎంసెట్, నీట్, ఐఐటి, జేఈఈ కోచింగ్ సి ఈ సి, ఎం ఇ సి విద్యార్థులకు సి ఎ, సి పి టి, టాలీ , అకౌంటింగ్ పైన కోచింగ్ ఇవ్వబడును. ఉచిత టెస్ట్ బుక్స్, నోట్ బుక్స్, యూనిఫామ్, స్కాలర్షిప్ సౌకర్యం కలదు. ఈ సదవకాశాన్ని గ్రామీణ ప్రాంత విద్యార్థినీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ ఈరవేణి రాజ్ కుమార్ తెలిపారు.

## మట్టి తవ్వకాలపై మైనింగ్ ఎడికి ఫిర్యాదు

ప్రజాపక్షం/ఆసిఫాబాద్ : కాగజ్ నగర్ లోని చారిగాం శివారులో అక్రమ మైనింగ్ స్థలంలో వార్తా సేకరణకు వెళ్లిన జర్నలిస్ట్ తిరుపతి పై మైనింగ్ నిర్వాహకులు దాడి చేశారని, ఆ స్థలంలో మట్టి తవ్వకాలకు అనుమతులు ఉన్నాయా లేవా అనే విషయంపై విచారణ చేపట్టాలని జర్నలిస్టులు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా సమీకృత కార్యాలయములోని గనులు, భూగర్భ శాఖ ఎడి గంగాధర్ రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ విషయంపై స్పందించిన మైనింగ్ ఎడి మాట్లాడుతూ కాగజ్ నగర్ ప్రాంతంలో మట్టి తవ్వకాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని, పట్టా భూముల్లో మట్టి తవ్వకాలు చేపట్టినా ఖచ్చితంగా తమ శాఖ అనుమతులు ఉండాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## రైతులు మోసపోకుండా మంచి విత్తనాలు కొనండి

* రైతు సోదరులకు హుజురాబాద్ సబ్ డివిజన్ పోలీసుల విజ్ఞప్తి



ప్రజాపక్షం/హుజురాబాద్ : రైతులు నకిలీ విత్తనాల వల్ల మోసపోకుండా మంచి విత్తనాలు కొనుగోలు చేసి మంచి పంటను పొందాలని రైతులకు హుజురాబాద్ ఏసిపి సిహెచ్ శ్రీనివాస్ సూచించారు. రైతులందరూ కూడా వర్షాకాలం లో పంటలు వేసుకోవడానికి అందరూ దుక్కి దున్ని విత్తనాల కొరకు ఎదురుచూస్తున్నారని, ప్రస్తుత పరిస్థితుల్లో నకిలీ విత్తనాల బెడద ఎక్కువగా ఉండటం వల్ల రైతు సోదరులందరూ కూడా మోసపోకుండా మంచి విత్తనాలను కొనుగోలు చేసి మంచి పంటను పొందాలని తెలియజేశారు.ప్రస్తుతం మార్కెట్లో మంచి విత్తనాలతో పాటు నకిలీ విత్తనాల బెడద ఎక్కువగా ఉన్నందున రైతులు మోసపోకుండా నాణ్యమైన పత్తి విత్తనాలను వరి విత్తనాలను ఎంచుకొని రైతులు తమ తమ పంట పొలాల్లో నాటుకోవాలని హుజురాబాద్ సబ్ డివిజన్ పోలీసులు రైతుల సంక్షేమం కొరకు పలు సూచనలు చేశారు. రైతులు మార్కెట్లో విత్తనాలను ఖరీదు చేసేటప్పుడు ఖచ్చితంగా బిల్లు తీసుకోవాలని, ఎక్కడైనా తక్కువ ధరకు వస్తున్నాయని ఆశపడి నకిలీ విత్తనాలను తీసుకుంటే ఆ తర్వాత భారీగా నష్టపోతారని అన్నారు. అలాంటి నష్టం రైతులకు వాటిల్లకుండా ఉండాలంటే నాణ్యమైన విత్తనాలను ఎంచుకొని తీసుకోవాలని తెలిపారు. ఎవరైనా ఎక్కడైనా నకిలీ విత్తనాలు మీకు ఇవ్వాలని చూసిన మీ దృష్టికి వచ్చిన వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్లో కానీ సంబంధిత పోలీసు అధికారులకు కానీ లేదా వ్యవసాయ అధికారులకు కానీ సమాచారం అందించాలని కోరారు.

## రాజపల్లిలోని అమ్మ ఆదర్శ పాఠశాల పనులు భేష్



జిల్లా కలెక్టర్ పమేల సత్పతి

ప్రజాపక్షం/హుజురాబాద్ : కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మండలంలోని రాజ పల్లి గ్రామం లోని ఆదర్శ పాఠశాల పనులను జిల్లా కలెక్టర్ పమేల సత్పతి శుక్రవారం ఆకస్మికంగా పర్యవేక్షించారు. పనుల్లో భాగంగా మేజర్, మైనర్ రిపేర్స్, టాయిలెట్స్, డ్రింకింగ్ వాటర్, ఎలక్ట్రిఫికేషన్, బేస్మెంట్లో పడిన నర్రలను పూడ్చడం తదితర పనులు 100% పూర్తవడంతో సత్పతి సంతృప్తి ని వ్యక్తపరిచారు. రాజపల్లి గ్రామం లో అమ్మ ఆదర్శ పాఠశాల పనులు వేగవంతం చేయుటకు కృషి చేసిన ఎంపీడీవోని, ఏఈని, ఎంఈఓ ని, వీ ఓ ఈర్ల వనమాల ని, ప్రధానోపాధ్యాయుల్ని, కాంట్రాక్టర్ ని అభినందించారు. మండలంలోని మిగతా పాఠశాల పనులు త్వరిత గతిన 100% పనులు పూర్తవ్వాలని అధికారులను ఆదేశించారు. స్థానిక ప్రధానోపాధ్యాయులు రంగోజీ శ్రీనివాస్ ని ఎంత మంది చదువుతున్నారు అని ప్రశ్నించి.. 32 మంది ఈ పాఠశాల లో విద్యార్థులు ఉండడం, మొక్కలతో పరిసరాలు, కాంపౌండ్ వాల్ చక్కగా ఉండడం చూసి హర్షం వెలిబుచ్చారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ కే విజయ్ కుమార్, ఎంపిడిఓ తూర్పాటి సునీత, ఎంఈఓ కేతిరి వెంకట నరసింహా రెడ్డి, ఏఈ మల్లారెడ్డి, హెడ్మాస్టర్ అనురాధ, సిఆర్పి సుధామన్ తదితరులు ఉన్నారు.

## ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల వేతనాలు చెల్లించాలి



ప్రజాపక్షం/జగిత్యాలజిల్లా ప్రతినిధి : నేషనల్ హెల్త్ మిషన్ స్కీంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు రావల్సిన మార్చి, ఏప్రిల్, మే 3 నెలల వేతనాలతో పాటు 7నెలల పి.ఆర్.సి. ఎరియర్స్ వెంటనే చెల్లించాలని ఏఎన్ఎం,ల్యాబ్ టెక్నీషియన్స్, ఫార్మసిస్ట్, డ్రైవర్స్ వివిధ రకాల క్యాడర్‌లకు సంబంధించి జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు కవ్వం లక్ష్మారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశామని ఏ ఎన్ ఎం ల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు పడాల మమత తెలిపారు. 3 నెలల వేతనాలు, 7నెలల పీఆర్సీ బకాయిలు చెల్లించాలని ల్యాబ్ టెక్నీషియన్, ఏ ఎన్ ఎం, ఫార్మసిస్ట్, డ్రైవర్ల విభాగాల అధ్యక్షుల ఆధ్వర్యంలో ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ కర్ణన్ ను కలిసి గురువారం హైదరాబాద్ లో వినతి పత్రం ఇచ్చామని పడాల మమత తెలిపారు. ఈ సందర్భంగా మమత మాట్లాడుతూ కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులందరు పేద, మధ్యతరగతికి చెందినవారే ఉన్నామని అన్నారు. గత మార్చి, ఏప్రిల్, మే 3 నెలల వేతనాలు అందకపోవడంతో పరిస్థితి దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. దినసరి, నెలసరి ఖర్చులు చెల్లింపులు చేయలేక కుటుంబ పోషణ కష్టతరముగా మారిందన్నారు. కమిషనర్ కర్ణన్ సానుకూలంగా స్పందించి పది రోజుల్లోగా పెండింగ్లో ఉన్న వేతనాలను ఇస్తామని, ఏరియార్స్ కు సమయం పదుతుందని చెప్పారని మమత వివరించారు. అలాగే జగిత్యాల జిల్లాలో ఏఐటియూసి నాయకులు వెన్న మహేష్ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారికి వేతనాలు, పీఆర్సీ బకాయిలు చెల్లించాలని కలెక్టరేట్ లో వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఫార్మాసిస్ట్ ల సంఘం పక్షాన శంకర్, డ్రైవర్ల పక్షాన రాంరెడ్డి ల్యాబ్ టెక్నీషియన్ల తిరుమల రెడ్డి, సమీ, ఆనంద్,పందిరి, రాజశేఖర్, రాణి ,నరసింహ,ఏ ఎన్ ఎం లు అనురాధ, ధనలక్ష్మి, మాదేశి శిరీషా, మేరీ, మరియా, శైలజ, పద్మ, శృతి, చందు, సత్యనారాయణ, సంతోష్, సురేష్, గంగాధర్, తిరుమలేష్ వివిధ క్యాడర్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## మొక్కల పెంపకం చేపట్టండి

కలెక్టర్ పమేలా సత్పతి



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : పాఠశాలలో ఖాళీగా ఉన్న స్థలంలో మొక్కల పెంపకం చేపట్టాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులకు సూచించారు. శుక్రవారం కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మండలం రాజపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గదుల్లో చేపట్టిన పనులను పర్యవేక్షించారు. ఏమేం పనులను చేపట్టారని అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ సరఫరా, లైటింగ్, ఫ్యాన్ల ఏర్పాటుతో పాటు టాయిలెట్స్, ఇతర వసతుల సంబంధించిన పనులు చేపట్టామని వివరించారు. అదేవిధంగా సంప్‌ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వాష్ రూముల్లో టైల్స్ వేయించాలని సూచించారు. పాఠశాలలో అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి వేయించాలని పేర్కొన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పించాలని సూచించారు. పాఠశాలలో ఖాళీ స్థలం బాగుందని, ఇందులో పండ్లు, పూలమొక్కల పెంపకం చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో హుజురాబాద్ తహసీల్దార్ విజయ్ కుమార్, ఎంపిడివో సునీత తదితరులు పాల్గొన్నారు.

## మీ సేవ అర్జీలు గడువులోగా పరిష్కరించాలి

తహసీల్దార్లతో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి : మీ సేవ అర్జీలు గడువులోగా పరిష్కరించాలని తహసీల్దార్లను కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. ధరణి, మీ సేవ, పెండింగ్ కోర్టు కేసులు, ధాన్యం కొనుగోళ్ల పై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ తో కలిసి జిల్లాలోని తహసీల్దార్లతో శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడారు. ధరణిలో వచ్చిన దరఖాస్తులను తహసీల్దార్లు పరిశీలించి తమ పరిధిలోని వాటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. తహసీల్దార్ల పరిధిలో లేని వాటిని ఆర్డీఓలు, కలెక్టర్ కు ఫార్వర్డ్ చేయాలని సూచించారు. ఆర్డీఓలు, తహసీల్దార్లు తమ పరిధిలోని కోర్టు కేసులను పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఆయా మండలాల పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్లు పరిశీలించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ సూచించారు. లారీల కొరత, ఇతర ఇబ్బందులు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. రైస్ మిల్లుల్లో ధాన్యం అన్ లోడింగ్ త్వరితగతిన చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు రాకుండా చూడాలని వివరించారు. వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టరేట్ ఏఓ రాంరెడ్డి, కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రీకాంత్ పాల్గొన్నారు.

## మద్యానికి బానిసై ఒకరి మృతి



**ప్రజాపక్షం/తానూర్ :** మద్యానికి బానిసై ఒకరి మృతి చెందిన సంఘటన మండలంలోని కోలూరు, గ్రామంలో చోటుచేసుకుంది. కోలుర్ గ్రామానికి చెందిన దేవరే మారుతి(45) తను కూతురి పెళ్లి చేయగా పెళ్లికి దాదాపు పది లక్షల వరకుఅప్పు చేయడం, అప్పు తీర్చలేక మద్యానికి బానిసై బుధవారం సాయంత్రం సమయంలో ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు, మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో కోలురు తాండ, నుంచి మసాలాగా,వేళ్లే రోడ్డు ప్రక్కన గల వ్యవసాయ బావిలో మద్యం మత్తులో దూకి చనిపోయి ఉన్నాడని అతని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లోక సందీప్ తెలిపారు.

## ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో మహిళలకు చీరెలా పంపిణీ

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటి కార్యనిర్వహక అధ్య కులు ఎమ్మెల్సీ బోమ్మ మహేష్ కుమార్ గౌడ్ జన్మదినం సందర్భంగా శుక్రవారం నాడు నిర్మల్ పట్టణంలోని ప్రియదర్శిని నగర్ లో ఉన్న డౌవు వృద్ధ ఆశ్రయంలో ఉన్న మహిళ లకు ఎన్.ఎస్.యూ.ఐ జిల్లా అధ్యక్షులు ఎంబడి.రాకేష్ ఆధ్వర్యంలో చీరెలా పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో టి.పి.సీసీ ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ ఎంబడి.రాజేశ్వర్ స్వర్ణ ప్రాజెక్టు మాజీ చైర్మన్ ఒల్రతి నారాయణ రెడి.ఎస్సీసెల్ జిల్లా కన్వీనర్ దమ్మసాగర్, సేవాదళ్ నాయకులు కే.రాజేశ్వర్, శ్రీధర్, సంస్థ సూపరిండెంట్ రామ్ కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులకు తలపాగాలు పంపిణీ



**ప్రజాపక్షం/పెద్దపల్లిటౌన్ :** భవన నిర్మాణ కార్మిక సమైక్య సంఘం జిల్లా అధ్యక్షులు చిలు వేరు స్వామి శుక్రవారం పెద్దపల్లి పట్టణంలో ఎండలో పనిచేస్తున్న 30 మంది కార్మికులకు తమ సొంత ఖర్చులతో తలపాగాలు ( టవల్స్) అందించారు. ఎండలు ఎక్కువగా కొడుతున్న కారణంగా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కార్మికులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మిట్టపల్లి సతీష్, కుక్క మల్లేష్, క్యాదాసి శ్రీని వాస్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన పాలీసెట్ ఎంట్రన్స్ పరీక్ష

ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం రోజున నిర్వహిం చిన టిఎస్ పాలిసెట్ ఎంట్రన్స్ పరీక్షలు పెద్ద పెల్లి జిల్లా లో ప్రశాంతంగా ముగిశాయి. శుక్ర వారం రోజున పరీక్షల సందర్భంగా పెద్దపల్లి ఎస్సై లక్ష్మణ్ రావు ఆధ్వర్యంలో పరీక్ష సెంటర్ల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘట నలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు.

## విద్యార్థులకు దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలి

### జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



**ప్రజాపక్షం/నిర్మల్‌ప్రతినిధి :** పభుత్వ పాఠశాలల విద్యా ర్థులకు ఏకరూప దుస్తుల పంపిణి కార్యక్రమాన్ని పకడ్బం దీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధికారు లను ఆదేశించారు.శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మంది రంలో విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీకి తీసుకుం టున్న చర్యల పై సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.ప్రయివేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వ ప్రతి ష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన ఏకరూప దుస్తుల పంపిణీకి జిల్లా లో అన్ని చర్యలు తీసుకోవాలని సూచిం చారు.ఇందులో భాగంగా తరగతుల వారీగా జున్ 12న ప్రతి విద్యార్థికి ఉచితంగా జత ఏకరూప దుస్తులు,పాఠ్య,నోటు పుస్తకాల పంపిణీకి చర్యలు తీసుకో వాలని ఆదేశించారు..జిల్లాలో 52,264 మంది విద్యా ర్థులు ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్నారని అందులో బాలికలు 28,319,బాలురు 23,945 మంది ఉన్నారని తెలిపారు.ఇప్పటికే మండలాల వారీగా ఏకరూప దుస్తుల క్లాత్ ను పంపిణి చేయడం జరిగిందని,మున్సిపాలిటీలలో మెప్మా,గ్రామీణ ప్రాంతాలలో డిఆర్డి ఆధ్వర్యంలో ఎస్.ఎచ్.జి మహిళలతో దుస్తులను కుట్టించడం జరుగుతు న్నదని తెలిపారు.సంబంధిత శాఖల అధికారులు స్టిచ్చింగ్ సెంటర్లను పర్యవేక్షించి రిపోర్టులను అందజేయాలని సూచించారు.అనంతరం పట్టణ గ్రామీణ ప్రాంతాలలో ఇప్పటివరకు స్టిచ్చింగ్ సెంటర్లు, కుట్టిన దుస్తుల సంఖ్య తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ఈ సమావే శంలో ఆర్డీఓ రత్నకల్యాణి, డీఈఓ రవీందర్ రెడ్డి, డీఆర్డీఒ విజయలక్ష్మి, జడ్పి సీఈఓ గోవింద్, డిపిఓ శ్రీనివాస్, సిపిఓ బాబురావు, సంక్షేమ శాఖల అధికారలు రాజేశ్వర్ గౌడ్, మనోహర్, మెప్మాపిడి సుభాస్, అధికారలు, ఎంఈఓలు, ఎపిఎంలు తదితరులు పాల్గొన్నారు.

## సమరయోధుల కుటుంబాల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

### కలెక్టర్లకు ప్రభుత్వ ఆదేశం

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** స్వాతంత్ర్య సమరయో ధులు, వారి కుటుంబాలకు సంబందించి అపరిష్కృతంగా వున్న పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలం గాణ ప్రభుత్వం జిల్లా కలెక్టర్లను ఆదేశించిందని తెలంగాణ స్వాతంత్ర్య సమరయోధుల వారసుల సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు బాలసాని వెంకటేశం తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా స్వాతంత్ర్య సమరయోధులు వారి కుటుంబాలు గత కొంత కాలంగా ఎదుర్కొంటున్న పలు సమస్యలను కొద్ది రోజుల క్రితం లేఖ ద్వారా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా స్పందించిన ముఖ్య మంత్రి వెంటనే రెవిన్యూ చీఫ్ సెక్రటరీకి తదనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేయడం జరిగిం దని ఆయన తెలిపారు. దీంతో స్వాతంత్ర్య సమరయోధుల వ్యవసాయ భూములకు సంబందించిన ఎన్ ఓ సీలు, ఇంటిస్థలాల కేటాయింపు అంశాలతో పాటు నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లా కేంద్రాలలో ఫ్రీడం ఫైటర్స్ భవనాల నిర్మాణం తదితర అంశాలను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ అడిషనల్ సెక్రటరీ టి. శేఖర్ 33 జిల్లాల కలెక్టర్ లకు జారిచేసిన ఆదేశాల కాపీ ప్రతులను బాల సాని వెంకటేశం మీడియాకు విడుదల చేశారు. సమరయో ధుల కుటుంబాలకు తగిన గుర్తింపును ఇచ్చి సమస్యల పట్ల సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ గౌడ్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు లకు స్వాతంత్ర్య సమరయోధుల వారసుల పక్షాన బాలసాని వెంకటేశం ధన్యవాదాలు తెలిపారు.

## విజయవంతంగా కొనసాగుతున్న యాసంగి ధాన్యం కొనుగోలు

### అదనపు కలెక్టర్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** 2023/24 సీజన్ యాసంగి ధాన్యం కొనుగోలు ప్రక్రియ పెద్దపల్లి జిల్లాలో జోరుగా కొనసాగుతున్నదని, నిర్దేశిత లక్ష్యంలో ఇప్పటి వరకు దాదాపు 92 శాతం మేరధాన్యం కొనుగోలు పూర్తి చేయడం జరిగిందని అదనపు కలెక్టర్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ తెలిపారు.జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదే శాలతో ప్రతినిత్యం పర్యవేక్షిస్తు ధాన్యం కొనుగోలు ప్రక్రి యనుగతం కంటే వేగవంతంగా పూర్తి చేస్తున్నామ న్నారు.ఈ సీజన్ లో ఇప్పటికే గత ఏడాది కంటే ఎక్కువ వడ్లను కొనుగోలు చేయడం జరిగిందని, జిల్లాలో ఈ యాసంగి సీజన్ లో నిర్దేశిత 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంలోఇప్పటివరకు 2 లక్షల 75 వేల 826 మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు.జిల్లాలో ఇప్పటివరకు మొత్తం38 వేల 720 మంది రైతుల వద్ద నుంచి 605 కోట్ల 20 లక్షలకు పైగా విలువ గల ధాన్యాన్ని కొనుగోలు చేసి, 35 వేల 653 మంది రైతులకు 499 కోట్ల 58 లక్షలకు పైగా ధాన్యం డబ్బులు వారి బ్యాంకు ఖాతాలలో జమ చేయడం జరిగిం దని, ధాన్యం అమ్మిన ఈ మూడు రోజులలోనే ఖచ్చితంగా రైతుల బ్యాంకు ఖాతాలలో డబ్బులు జమ చేస్తున్నామ న్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శ కంగా జరుగుతున్నదని, నాణ్యమైన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నామన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో వర్షాల వల్ల ధాన్యం తడవకుండా టార్పాలి న్లను ఉంచామని, అవసరమైన మేర ప్యాడి క్లీనర్లు ఏర్పాటు చేసి ధాన్యం క్లీనింగ్ చేయడం ద్వారా తాలు పేరుతో వచ్చే కోతల సమస్యను పరిష్కరించామన్నారు. రైతులకు ఎటు వంటి నష్టం కలగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటూ వేగ వంతంగా ధాన్యం కొనుగోలు చేపట్టి సకాలంలో చెల్లిం పులు జరుపుతున్నామని తెలిపారు.

## విత్తనాల కొనుగోళ్లపై రైతులకు అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/ముత్తారం :** విత్తనాల కొనుగోళ్లపై రైతులకు అవగాహన సదస్సు మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్ ఆధ్వర్యంలో ముత్తారం మండలంలోని శుక్ర వారం పేట గ్రామంలో నిర్వహించారు.వాన కాలంలో విత్త నాలు కొనుకోలు చేసేటప్పుడు తీసుకోవాల్సిన బాగ్రత్తలు గురించి రైతులకు మండల వ్యవసాయ అధికారి చిందం శ్రీకాంత్ అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేస్తున్న సమయంలో బిల్ తీసుకొని, పంట కాలా సూచించడం జరుగుతుందన్నారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేస్తున్నప్పుడు తీసుకున్న బిల్లులను పంట ముగిసే వరకు భద్రపరుచుకోవాలని ఏవో శ్రీకాంత్ తెలిపారు.బిల్లులపై విత్తన లాట్ నెంబర్, గడువు కాలంలను సరి చూసుకోవాలని కోవాలని తెలిపారు. వరిపంట సాగు చేసే రైతులు తప్పనిసరిగా పచ్చి రొట్టె విత్త నాలైన జీలుగ వేయాలని తద్వారా భూసారం పెంచుకోవా లని సూచించారు.వరి పంట కోత తర్వాత, వరిలో కొయ్య కాళ్ళను కాల్చకుండా, నీరు వేసి 3 బస్తాలు ఎస్ఎస్ పి మందులను వేయాలని వరి కొయ్య కాళ్లు మురిగి, భూసారం పెరుగుతుందని మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్ రైతులకు తెలిపారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారులతో పాటు గ్రామంలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా కామ్రేడ్ నల్లమల్ల గిరి ప్రసాద్ వర్ధంతి

**ప్రజాపక్షం/నిర్మల్/అదిలాబాద్ :** కామ్రేడ్ నల్లమల గిరి ప్రసాద్ 27వ వర్ధంతి సిపిఐ జిల్లా కార్యాలయం బుక్తాపూర్ లో సిపిఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి,శ్రద్ధాంజలి ఘటించారు.ఈ సందర్భంగా మూడుపు ప్రభాకర్ రెడ్డి మాట్లా డుతూ కామ్రేడ్ గిరి ప్రసాద్ విద్యార్థి దశలోనే ఉద్యమాల పాట పట్టినారు.1961 లో ఖమ్మం శాసనసభ్యుడిగా,1978 నుండి 91వరకు సిపిఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శిగా 13 సంవత్స రాలు కొనసాగినారు.అలాగే ఆంధ్ర మహాసభ చైర్మన్గా,1992 నుండి రాజ్యసభ సభ్యుడిగా సిపిఐ పార్టీలో జాతీయ నాయకు డిగా గుర్తింపు పోంది ఖమ్మం జిల్లాలో లేదా రాష్ట్రంలో ఒక బల మైన సిపిఐ పునాదులు వేసి కమ్యూనిస్టు పార్టీని బలోపేతం చేసిన మహానీయుడు మహా నాయకుడు గొప్ప నాయకుడు కామ్రేడ్ గిరిప్రసాద్ అని సిపిఐ జిల్లా కార్యదర్శి మూడు ప్రభా కర్ రెడ్డి కొనియాడారు.గిరిప్రసాద్ ఆశయ సాదన కొరకు సిపిఐ జిల్లా సమితి ముందుకు పోవాలని వారి ఆశయాలు నెరవేర్చిన ప్పుడే వారికి విప్లవ ధన్యవాదాలు తెలిపిన వారు అవుతాం అని అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్ అరుణ్ కుమార్,సిపిఐ సీనియర్ నాయకులు బెజ్జంకి నర్సింగ్ రావు అరిగెల గజారాం,బికేయం యు జిల్లా ప్రధాన కార్యదర్శి అద్దంకి రమేష్.బికేయంయు జిల్లా అధ్యక్షులు ఖండాల గణేస్,సిపిఐ మండల నాయకుల జైనథ్ ఆకుల వెంకన్న,మీరు తదితరులు సిపిఐ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## గుండెపోటుతో కానిస్టేబుల్ మృతి



**ప్రజాపక్షం/ముత్తారం :** మంథని ఎక్సైజ్ కార్యాలయంలో విధులు నిర్వ హిస్తున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ సతీష్ గురువారం అర్థ రాత్రి గుండెపోటు తో మృతి చెందాడు. ఎక్సైజ్ కానిస్టేబుల్ మృతి చెందారనే మరణ వార్త విన్న ముత్తారం మండల పరిధి లోని గ్రామాల మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ పార్టీల నాయకులు, వైన్ షాపుల నిర్వాహకుల తో పాటు పలువురు కానిస్టేబుల్ సతీష్ మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కాగా మృతుడిది స్వగ్రామం పెద్దపల్లి జిల్లా గౌ రెడ్డి పేట గ్రామ గ్రామ స్తుడు ముత్తారం మండలానికి విధి నిర్వహణ కోసం వచ్చే సమ యంలో అందరితో కలుపుగోలుగా ఉంటూ మంచికి మారు పేరు గా ఉన్న ఎక్సైజ్ కానిస్టేబుల్ సతీష్ మరణం చాలా బాధా కరమని పలువురు నాయకులు పేర్కొన్నారు.కాగా మృతుడి సగ్రామం పెద్దపల్లి జిల్లా గౌ రెడ్డి పేట గ్రామంలో ఎక్సైజ్ కానిస్టే బుల్ సతీష్ అంత్యక్రియలు నిర్వహించగా నాయకులు, అధికా రులు అంతిమయాత్రలో పాల్గొని నివాళులర్పించారు.

## విజయ్ కుటుంబానికి కాంట్రాక్టర్ నష్టపరిహారం చెల్లించాలి



**ప్రజాపక్షం/పెద్దపల్లిప్రతినిధి :** గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో మృతి చెందిన విజయ కుటుంబాన్నిదళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి కందుకూరి రాజారత్నం రాష్ట్ర సమితి సభ్యులు మద్దెల దినేష్ నగర కార్య దర్శి ఎర్రల రాజయ్య నాయకులు ప్రసాద్, సుద్దాల అనురాజ్ ,మృతి చెందిన విజయ్ ఇంటికి వెళ్లి వారి కుటుంబాన్ని కలిసి పరామర్శించడం జరిగింది. అనంతర వారు మాట్లాడుతూ నియంత అయిన కాంట్రాక్టర్ మరియు లేబర్ అధికారులు, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ నిర్లక్ష్యం వల్లనే నిరుపేద దళితుడు మృత్యువాత పడ్డాడని వారి కుటుంబానికి కాంట్రాక్టర్ న్యాయం చేయాలని దళిత హక్కుల పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు.కాంట్రాక్టర్ కు ఇలాంటి ప్రమాదాలు కొత్త కాదని ఇదివరకు కూడా వివిధ రాష్ట్రాలకు చెందిన కార్మికులు బిల్డింగ్లపై జారిపడి మృత్యువాత పడుతుంటే కనీసం ఆ కుటుం బాలకు అండగా నిలవకుండా గుట్టు సప్పుడు కాకుండా శవా లను వారి ప్రాంతాలకు పంపించడం అలవాటుగా చేసుకు న్నాడ ని దీనికి లేబర్ అధికారులు మరియు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ సదరు కాంట్రాక్టర్కు అండగా నిలవడం విడ్డూరంగా ఉందని ఇలాంటి కాంట్రాక్టర్ పై కఠిన చర్యలు తీసుకొని , మరో కాంట్రాక్టర్ కు పని అప్పజెప్పాలని అధికారులను కోరారు. పిద ళిత నిరుపేద కుటుంబానికి చెందిన వాడు చనిపోతే కనీసం నష్ట పరిహారం కూడా ఈయకుండా కాంట్రాక్టర్ పై మానవ హక్కుల కమిషన్ కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.